క్లుప్తంగా

రాజగోపాల్‌రెడ్డి అనుచరుల రాజీనామా

చండూరు: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రాకపోవడం పై ఆయన అనుచరులు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రభుత్వ, పార్టీ పెద్దలు హామీ ఇచ్చినట్టుగా భువనగిరి ఎంపీ సీటు గెలిపిస్తే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని మోసం చేశారని చండూరు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కోడి గిరిబాబు, దోనిపాముల గ్రామశాఖ అధ్యక్షుడు తిప్పర్తి పాండు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామాలు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని పద్మశాలి భవనంలో ఆదివారం మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ది నల్లగొండ డిస్ట్రిక్ట్ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చిలుకూరి పరమాత్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొంపెల్లి గోవర్ధన్, కోశాధికారిగా చిలుకూరి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిరిప్రోలు వెంకటపతి, పోశం రఘుపతి, పోశం లక్ష్మీనారాయణ, వల్లందాసు శ్రీనివాసులు, పెండెం కృష్ణకుమార్, సీహెచ్. ధనుంజయ్య, వంగరి కృష్ణచైతన్య, గోవింద్‌సింగ్, సురేందర్, వరప్రసాద్, రాజు పాల్గొన్నారు.

బీజేపీ కనగల్ మండల ప్రధాన కార్యదర్శిగా వెంకన్న



కనగల్: బీజేపీ కనగల్ మండల ప్రధాన కార్యదర్శిగా దాసరి వెంకన్న రెండోసారి నియమితులయ్యారు. బీజేపీ మండల అధ్యక్షుడు పర్సనబోయిన భిక్షం ఆయనకు ఆదివారం నియామక పత్రం అందజేశారు.

బీజేపీ నూతన కార్యవర్గం నియామకం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పఎఙ్జారి వెంకట్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కొరివి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి శ్రవణ్‌ల ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా నోముల నాగరాజు, చిరుమర్తి వెంకన్న, బావండ్లపల్లి ఉపేందర్, మల్లెబోయిన రామలింగం, ప్రధాన కార్యదర్శులుగా అక్కెనపల్లి సత్తయ్య, బిళ్లకంటి శ్రీకాంత్, ఎడమ పురుషోత్తంరెడ్డి, కార్యదర్శులుగా వనం శంకర్, బెక్కంటి గణేశ్, గండికోట శ్రీకాంత్, కోశాధికారిగా తోటకూరి శివకుమార్‌లను నియమించినట్లు తెలిపారు.

నూతన మంత్రి లక్ష్మణ్‌ను కలిసిన ఎమ్మెల్యే వీరేశం


మంత్రి లక్ష్మణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌ను ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మణ్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు బచ్చుపల్లి గంగాధర్‌రావు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

చిట్యాల: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముదిరాజ్ కుల విద్యార్థులను ఆదివారం చిట్యాల మున్సిపాలిటీ పాండవ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు గొడుగు లక్ష్మీభవాని, జోగు యశ్వంత్, సుందర్, మేఘవర్షిణి, పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన పద్యోళ్ళ రిత్విక్, ఆవుల జితేందర్, నిమ్మల స్నిగ్ధలకు ఒక్కొక్కరికి వేయి నూటా పదహారు రూపాయలతోపాటు జ్ఞాపికలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు గొడుగు యాదగిరి, ఉపాధ్యక్షుడు పల్లెమోని చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి గొడుగు అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బోడ నర్సింహ, కోశాధికారి పల్లెమోని నర్సింహ, బాలాజీ పాల్గొన్నారు.

మోస్తరుకు మించి కురిసిన వర్షం

మర్రిగూడ: వేసవి ఎండలు తాళలేక ఉక్కపోతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆదివారం మండల వ్యాప్తంగా మోస్తరుకు మించిన వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఎండల నుంచి ఉపశమనం లభించిందని ప్రజలు పేర్కొంటున్నారు.

అభివృద్ధి పథంలో నకిరేకల్


నకిరేకల్ పట్టణం వ్యూ


నకిరేకల్ పట్టణంలోని వంద పడకల వైద్యశాల

- అందుబాటులో 100 పడకల వైద్యశాల
- మూడు హైవేలతో అనుసంధానం
- తెలంగాణ రాష్ట్రంలో ప్రప్రథమంగా నిమ్మ మార్కెట్
- నాకు రేక కల్లే.. నకిరేకల్

నకిరేకల్: నాడు చిన్న గ్రామంగా ఉన్న నకిరేకల్.. మూడు జాతీయ రహదారులకు అనుసంధానంగా మున్సిపాలిటీగా, నియోజకవర్గ కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతోంది. రైతుల కోసం నకిరేకల్‌లో వ్యవసాయ, నిమ్మ మార్కెట్ ఏర్పాటు చేశారు. అనేక పార్‌బాయిల్డ్, రైస్, పత్తి మిల్లులు, ఇతర వ్యాపారాలతో నకిరేకల్ వ్యాపార వాణిజ్య కేంద్రంగా మారింది. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం కోసం 100 పడకల వైద్యశాల అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలో ప్రప్రథమంగా నకిరేకల్‌లో నిమ్మ మార్కెట్‌ను స్థాపించారు. వివిధ ఆలయాలతో ఆధ్యాతిక కేంద్రంగా విరాజిల్లుతోంది.

కొత్తగా వెలిసిన అనేక కాలనీలు

అభివృద్ధి చెందుతున్న నకిరేకల్ పట్టణంలో అనేక కొత్త కాలనీలు వెలిశాయి. వీటిలో ప్రధానంగా బొడ్రాయి బజార్, పన్నాలగూడెం, వెంకటేశ్వర నగర్, డాక్టర్స్ కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, పటేల్ నగర్, కాటమయ్య బజార్, రహిమత్ నగర్, చీమలగడ్డ, బాబాసాహెబ్‌గూడెం, పద్మనగర్, శివాజీ నగర్, సంతోష్‌నగర్, విద్యానగర్, వినాయక నగర్, టీచర్స్ కాలనీ, రెడ్డి నగర్, ఎస్సీకాలనీ, ఎస్‌ఎల్‌బీసీ, వాసవి నగర్, పద్మశాలీ కాలనీ, సుందరయ్య నగర్, రంగారెడ్డి నగర్‌లు వెలిశాయి.


నిమ్మ మార్కెట్

నకిరేకల్‌కు ఆపేరు ఎందుకు వచ్చిందంటే..

నకిరేకల్‌కు ఆపేరు ఎందుకు వచ్చిందో ఇక్కడి ప్రజలు అనేక రకాలుగా చెబుతుంటారు. నకిరేకల్ ప్రాంతంలో తాటి చెట్లు ఎక్కువగా ఉండడంతో పాటు కల్లు గీసి అమ్మే గీత కార్మికులు కూడా అధికంగా ఉన్నారు. ఇక్కడి తాటి వనంలో కల్లు తాగేందుకు ఇతర ప్రాంతాల నుంచి ఆనాడు అనేకమంది వస్తుండేవారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్ నుంచి ఒక ముస్లిం ఇక్కడికి వచ్చి కల్లు తాగేవాడు. నిత్యం ఇక్కడికి వచ్చి నాకు.. రేక కల్లు.. కావాలని అడుగుతుండేవాడని..అందుకే ఈ ప్రాంతానికి నాకు రేక కల్లు అనే పేరు వచ్చిందని.. అది కాలక్రమేణా నకిరేకల్‌గా మారిందని చెబుతుంటారు.

చారిత్రాత్మకంగా ఇలా..

చారిత్రాత్మకంగా చూస్తే 13వ శతాబ్దంలో వినుకొండ వల్లభరాయుని క్రీడాభిరామం అనే గ్రంథంలో నాగరికల్లు ఉంది. నాగరికల్లు అంటే పన్నులు లేని వర్తక వాణిజ్య కేంద్రం. అయితే ముస్లింల పాలనలో గోల్కొండ నుంచి మచిలీపట్నం వరకు వర్తక వ్యాపార సంబంధాలు ఉండేవి. మధ్యలో పన్నులు లేని వర్తక వాణిజ్య కేంద్రం (నాగరికల్లు)ఉంది.


శ్రీషిరిడీ సాయి మందిరం

ప్రణాళిక రూపొందించాం



నకిరేకల్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే ప్రధాన రోడ్డు విస్తరణ జరిగింది. మార్కెట్, మూసీ, తిప్పర్తి రోడ్లను విస్తరించి డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశాం. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ ప్రయాణికులు మెయిన్ సెంటర్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధాన సెంటర్‌లో ఉన్న పోలీస్ స్టేషన్ భవనం స్థానంలో బస్టాండ్ నిర్మించబోతున్నాం. పెద్ద చెరువు, కాలంవారీ కుంటలను మరింత అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా మార్చబోతున్నాం.

– వేముల వీరేశం, ఎమ్మెల్యే, నకిరేకల్

అయితే ఈ నాగరికల్లు అనే పేరే రూపాంతరం చెంది నకిరేకల్‌గా మారిందని ప్రచారంలో ఉంది.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి


చిట్యాల: బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని చిట్యాల ఎంఈఓ పానుగోతు సైదానాయక్ కోరారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో ఆదివారం నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వసతులు కలిగి, నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు లుకేందర్‌రెడ్డి, జానకి, భవాని ఉపాధ్యాయులు సరస్వతి, మౌనిక, సరిత, విమల, ఎస్‌ఎంసీ మాజీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు ఐక్యంగా కృషి చేయాలని ఎంఈఓ అంబటి అంజయ్య అన్నారు. ఆదివారం కట్టంగూర్ మండలంలోని కల్మెర గ్రామంలో బడిబాట కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కల్మెర గ్రామానికి చెందిన కంచర్ల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఆ గ్రామ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌తో పాటు బీరువాను ఎంఈఓకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎం నర్రా సరళ, ఉపాధ్యాయులు కంచర్ల శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జితేందర్‌రెడ్డి, రేణుక, సాహిత, రాములమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రముఖ వైద్యుడు మృతి


కుంభం ఇంద్రారెడ్డి (ఫైల్)

మర్రిగూడ: మండల పరిధిలోని శివన్నగూడ గ్రామానికి చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణుడు కుంభం ఇంద్రారెడ్డి(76) ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో గల ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. మర్రిగూడ ప్రాంత ప్రజలు హైదరాబాద్‌లోని ఆయన ఆస్పత్రికి వెళ్తే ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా వైద్యం అందించేవారు. తిరుగు ప్రయాణానికి సైతం రవాణా ఖర్చులు అందించేవారు. అదేవిధంగా గ్రామంలోని పాఠశాలలకు, గుడి నిర్మాణానికి, పేదలకు వైద్య ఖర్చులకు తనవంతు సహాయ, సహకారాలు అందించేవారు. ఆయన మృతికి మండలంలోని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఇంద్రారెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఆయన అంత్యక్రియలను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

నేడు ఓపెన్ ఫోరం

నార్కట్‌పల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై 15వ విడత సోషల్ ఆడిట్ జరుగుతుందని నార్కట్‌పల్లి ఎంపీడీఓ కె.ఉమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంవలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు , ఉపాధి హామీ సిబ్బంది సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

గోపినాథ్ మృతికి సంతాపం

నల్లగొండ టూటౌన్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతికి నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంచర్ల కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. పేద ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ మూడుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గోపినాథ్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న దేవేందర్‌యాదవ్

మునుగోడు: ప్రజలను మభ్యపెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తోందని, కాంగ్రెస్ మోసాలను ప్రజలకు క్షుణంగా వివరించాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్ కోరారు. ఆదివారం మునుగోడులో జరిగిన బీజేపీ మండల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. గ్రామాల్లో రచ్చబండ సభలు నిర్వహించి వాటిని ప్రజలకు తెలియచేయాలని సూచించారు. 11 ఏళ్లుగా బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన పురోగతిని వివరించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్ గౌడ్, మాదగోని నరేందర్ గౌడ్, పగిళ్ల భిక్షం, బండారి యాదయ్య, అక్కెనపల్లి సతీష్, పందుల యాదయ్య పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ బోనాలు


బోనాలతో వస్తున్న ప్రజలు


పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని మర్రిగూడలో గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఊట్కూరు వెంకటరెడ్డి, బొజ్జ వెంకన్న, చిట్టిబాబు, కత్తుల సహదేవ్, దొండ ముతేష్, దేవయ్య, మంద వెంకట్‌రెడ్డి, జేరిపోతుల లింగయ్య, సైదులు సందీప్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘గిరిజనులను మోసం చేసిన ప్రభుత్వం’

మర్రిగూడ: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా మోసం చేసిందని గిరిజన విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మెగావత్ చందునాయక్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి గిరిజన సమావేశానికి వెళ్తున్న ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి గిరిజనులపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

మరుగుదొడ్లు ఉన్నా.. ఉపయోగం సున్నా



బస్టాండ్ ఆవరణలో తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు

మునుగోడు: ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు మునుగోడు బస్టాండ్‌లో నిర్మించిన మరుగుదొడ్లు ఉపయోగం లేకుండా పోతున్నాయి. మూడేళ్ల క్రితం కలెక్టర్ ప్రత్యేక నిధుల ఖర్చుచేసి ప్రయాణికుల సౌకర్యార్థం రెండు మరుగుదొడ్లు నిర్మించారు. అందులో ఒక్కటి స్త్రీలకు మరొకటి పురుషులకు కేటాయించారు. కానీ వాటిని ఉపయోగించకుండా నిత్యం తాళం వేసి ఉంచుతున్నారు. దీంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించినవారిపై బస్టాండ్‌లో పనిచేసే స్వీపర్లు మండిపడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్లు ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కనులపండువగా కల్యాణ మహోత్సవం


ఉరుమడ్ల గ్రామంలో రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ మహాకుంభాభిషేకం వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కలశ స్థాపన, మండప పూజలు, యంత్ర స్థాపన, ప్రాణప్రతిష్ఠ, అష్టబలి, కుంభబలి కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ నిర్మాణ దాతలు కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు, హోమం చేశారు. గర్భగుడిలో పురోహితుడు నున్న కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు గర్భగుడిలో శ్రీరామలింగేశ్వర స్వామి దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.

బోనాలతో ఊరేగింపు..

ఉత్సవాల సందర్భంగా రేణుకా ఎల్లమ్మ తల్లికి గ్రామస్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పసుపు, కుంకుమ, వేప కొమ్మలు, దీపాలతో అందంగా అలంకరించిన బోనాలను డప్పుచప్పులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ తల్లికి మహిళలు, యువతులు మొక్కులు మొక్కుకుని, నైవేద్యం సమర్పించారు. ఆలయ ఆవరణలో అందంగా ముస్తాబు చేసిన కల్యాణ మండపంలో శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వేద పండితులు కనులపండుగగా నిర్వహించారు. అందంగా ముస్తాబు చేసిన ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగింపుగా గర్భగుడి నుంచి కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేదమంత్రాలతో శ్రీ పార్వతి రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం నిర్వహించారు. ఒడిబియ్యం పోసే కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలాట బృందం భజనలు అలరించాయి. కుంభాభిషేకం ముగింపు వేడుకల్లో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండ, భువనగిరి జెడ్పీ మాజీ చైర్మన్‌లు బండా నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నకిరేకల్, దేవరకొండ, మునుగోడు మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నాయకులు దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, సోమ భరత్‌కుమార్, కటికం సత్తయ్య గౌడ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, సత్తయ్య యాదవ్, యాదగిరిగౌడ్, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజుగౌడ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, సుంకరబోయిన నర్సింహ, భిక్షం, ఆవుల నర్సింహ, చిన నర్సింహ పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న కంచర్ల కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు


పూజలో పాల్గొన్న చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, బండా నరేందర్‌రెడ్డి

మృగశిర కార్తె.. చేపలకు భలే గిరాకీ


నకిరేకల్: మూసీ రోడ్డులో చేపల విక్రయాలు


శాలిగౌరారం : తిరుమలరాయునిగూడెంలో ..

నకిరేకల్ : మృగశిర కార్తెను పురస్కరించుకుని నకిరేకల్ పట్టణంలోని మూసీ రోడ్డులో ఉన్న చేపల మార్కెట్ ఆదివారం సందడిగా మారింది. చేపలు, బాతులు, కుందేళ్లను ఆటోల్లో తీసుకొచ్చి విక్రయించారు. మూసీ రోడ్డు చేపల మార్కెట్ జనంతో కిక్కిరిసి పోయింది. కేజీ కొర్రమేను రూ.600, రవ్వ, బొచ్చ రూ.250 నుంచి 300, జత బాతులు రూ.150, ఒక కుందేలు రూ.550 పైనే విక్రయించారు. పాంప్లెట్ చేపలు కేజీ రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయించారు.

కట్టంగూర్ : మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం కట్టంగూర్‌లో చేపల గిరాకీ ఊపందుకుంది. దీంతోపాటు మటన్ కొనేందుకు ప్రజలు బారులు దీరారు. చేపలు, మటన్, చికెన్ అమ్మకాలతో కట్టంగూర్‌లోని మసీదు వైపు ఉన్న సర్వీసు రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు.

శాలిగౌరారం: అసలే ఆదివారం.. ఆపై మృగశిర కార్తె ప్రారంభం.. ఇంకేముంది చేపలు, మాంస విక్రయ దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయాయి. శాలిగౌరారం మండల వ్యాప్తంగా ఉదయం ప్రారంభమైన మాంస విక్రయాలు రాత్రి వరకు కొనసాగాయి. శాలిగౌరారం మండలంలోని తిరుమలరాయునిగూడెంలో శాలిగౌరారం ప్రాజెక్టు కట్ట అంచుపై ఉన్న చేపల విక్రయ దుకాణాల వద్ద ప్రజలు చేపల కోసం పోటీపడ్డారు. శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండి ఉండడం , చేపలు వలలకు చిక్కకపోవడంతో చేపల విక్రయదారులు మరోచోటు నుంచి చేపలను తీసుకువచ్చి విక్రయించారు.

దేశ రక్షణకు యువత పాటుపడాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఈదులగూడెంలో ఆదివారం శివాజీ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్సవ సమితి నాయకులు మాట్లాడుతూ.. శివాజీని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశం కోసం, ధర్మం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మామిడి సత్యనారాయణ, బంటు గిరి, కొంగరి వెంకటరమణ, అభి, ఆనంద్, క్రాంతికుమార్, వంశీ, శ్రీకాంత్, చరణ్, తేజ, అనిల్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలంలోని పెద్ద సూరారం గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.7లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువలు, రూ.10 లక్షల వ్యయంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ పెండెం రత్నమాల పాండు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి యాదగిరి యాదవ్, ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తంతెనపల్లి రామలింగం, ఏడుదొడ్ల కొండల్‌రెడ్డి, ఏడుదొడ్ల కృష్ణారెడ్డి, గుండె వెంకన్న, ముసుకు భిక్షం, కోట్ల జలందర్ రెడ్డి, ఎర్రమాద మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఉన్న తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల వారు పాఠశాలలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ తెలుగు, టీజీటీ హిందీ-2, పీజీటీ ఇంగ్లిష్-2, తెలుగు పీజీటీ, పొలిటికల్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. టీజీటీకి బీఎడ్‌తోపాటు టెట్ అర్హత కల్గి ఉండాలి, పీజీటీకి పీజీ, బీఎడ్ అర్హత ఉండాలని తెలిపారు. నెలకు 100 గంటలు పని చేస్తే రూ.18,200 జీతం ఉంటుందన్నారు. నాంపల్లి మండలంలోని నిరుద్యోగులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.